ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలి
ఐటీడీఏ పీవో రాహుల్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, ఆగస్టు 1: ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలు ఘనంగా జరుపుకోవాలని, అందుకు అన్నిరకాల సహాయ, సహకారాలు అందిస్తామని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ ఆదివాసీ తెగల సంఘ నాయకులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ గిరిజన తెగలు ఘనంగా జరిపే వేడుకను ఐటీడీఏ తరపున ఐకమత్యంతో నిర్వహించాలన్నారు. ఐటీడీఏ జనరల్ డేవిడ్‌రాజ్, మేనేజర్ ఆదినారాయణ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని పరామర్శించిన ఐటీడీఏ పీవో

భద్రాచలం గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న గిరిజన బాలిక బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో బీ రాహుల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను గురువారం పరామర్శించి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఆ బాలిక కోరుకున్న చోట సీటు ఇప్పిస్తామని తల్లికి పీవో తెలిపారు.

క్రమశిక్షణను తమ జీవితాల్లో అలవర్చుకోవాలి

టేకులపల్లి, ఆగస్టు 1: క్రమశిక్షణను విద్యార్థులు తమ జీవితాల్లో అలవర్చుకొని మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి, టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీ సులోచనరాణి అన్నారు. ములకలపల్లి కళాశాల నుంచి టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై గురువారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు

కొత్తగూడెం ఎడ్యుకేషన్. ఆగస్టు 1: చిన్నతనం నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయతపై అవగాహన పెంచాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, జిల్లా ఏఎస్‌వో నాగరాజశేఖర్ కోరారు. కొత్తగూడెంలోని ఆనందఖని రిసోర్స్ సెంటర్‌లో గురువారం ఇన్‌స్పైర్ మనాక్-2024పై కొత్తగూడెం డివిజన్ పరిధిలోని సైన్స్, గణితం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి తప్పనిసరిగా ఇన్‌స్పైర్ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, సాయికృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్ పాల్గొన్నారు.

పాల్వంచ, ఆగస్టు 1: ఇన్‌స్పైర్‌పై స్థానిక బొల్లోరిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సమావేశాన్ని జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, ఎంఈవో శ్రీరాంమూర్తి నిర్వహించారు. పాల్వంచ, దమ్మపేట, అశ్వారావుపేట, ముల్కలపల్లి, మణుగూరు నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు.

చెరువులకు జలకళ

చుంచుపల్లి, ఆగస్టు 1: భారీగా కురిసిన వర్షాలతో చెరువులు పూర్తిగా నిండి కళకళలాడుతున్నాయి. మండలంలో పెనగడప ఎర్ర చెరువు, పెద్ద చెరువు మత్తడి పోస్తున్నాయి. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'బొగ్గు' ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కరపత్రాలు

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 1: సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ ప్రాజెక్ట్ ప్లానింగ్ ఈఆర్‌పీలో సీఐటీయూ నాయకులు గురువారం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోల్ బెల్ట్ ఏరియాల్లో సీపీఎం చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. గాజుల రాజారావు, వెంకటేశ్వర్లు, కూరపాటి సమ్మయ్య పాల్గొన్నారు.

సింగరేణిలో 93 శాతం బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 1: సింగరేణివ్యాప్తంగా జూలైలో 93 శాతం బొగ్గు ఉత్పత్తి అయింది. భారీ వర్షాలతో ఓపెన్‌కాస్ట్ గనుల్లో నీరు చేరడంతో ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. అయినప్పటికీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, బొగ్గు రవాణాకు ఆటంకం రాకుండా చూశారు.

కొత్తగూడెంలో 92 శాతం బొగ్గు ఉత్పత్తి

రామవరం, ఆగస్టు 1: సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఈ ఆర్థిక సంవత్సరం జూలై నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 9.98 లక్షల టన్నులకుగాను 9.18 లక్షల టన్నులు (92 శాతం) సాధించినట్లు జీఎం శాలెంరాజు తెలిపారు. ఆయన గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు 45.11 లక్షల టన్నులకుగాను 41.76 లక్షల టన్నులు (93 శాతం) ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. అధికారులు కోటిరెడ్డి, సిహెచ్.రామకృష్ణ, హనా సుమలత, శివకేశవ రావు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పోరుబాట

ఇల్లెందు రూరల్ : మున్సిపల్ కమిషనర్ యాదగిరికి వినతిపత్రం ఇస్తున్న హరిప్రియ

అశ్వాపురం: ఎంపీడీవో వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బూర్గంపహాడ్: భద్రాచలం పంచాయతీ ఈవోకు వినతి ఇస్తున్న మానే రామకృష్ణ, నాయకులు

ములకలపల్లి: వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లక్ష్మీదేవిపల్లి: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరకగూడెం: భట్టుపల్లిలో పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని జస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 1: పంచాయతీల్లోని సమస్యలను పరిష్కరించాలని, నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. ఆ పార్టీ నాయకులు, ప్రస్తుత-మాజీ ప్రజాప్రతినిధులు అధికారులకు గురువారం వినతిపత్రాలు ఇచ్చారు. పలుచోట్ల రాస్తారోకోలు, ధర్నాలు చేశారు.

దమ్మపేట, ఆగస్టు 1: మండలంలో పారిశుధ్యం అధ్వాసంగా ఉన్నదంటూ ఎంపీడీవో కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. అధికారికి వినతి పత్రం ఇచ్చారు.

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 1: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. చంద్రుగొండ, ఆగస్టు 1: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్న డిమాండుతో బీఆర్ఎస్ నాయకులు మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎంపీడీవో అశోక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ములకలపల్లి, ఆగస్టు 1: మండల పరిషత్ కార్యలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. ఎంపీడీవో మహాలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు.

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 1: పారిశుధ్య లేమి తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల అధికారులకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాలు ఇచ్చారు.

దుమ్ముగూడెం/సారపాక/బూర్గంపహాడ్/టేకులపల్లి/మణుగూరు టౌన్/ఇల్లెందు రూరల్/అశ్వాపురం/ ఆళ్లపల్లి/కరకగూడెం/చర్ల/పినపాక, ఆగస్టు 1: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల కాలంలో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని అన్ని పంచాయతీల్లో శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షు డు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపు మేరకు గ్రామాల్లోని పంచాయతీల వద్ద బీఆర్ఎస్ నాయకులు గురువారం నిరసన తెలిపి సమస్యలతో కూడిన వినతిపత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయాక్, నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తచెదారం పేరుకుపోయి, కాలువలు పూడికతీత లేక, మురుగునీరు నిలిచి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు, పంచాయతీలు అద్భుతంగా ఉన్నాయని, నేటి కాంగ్రెస్ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయని దుయ్యబట్టారు.

సీఎం వ్యాఖ్యలకు నిరసన

కొత్తగూడెం అర్బన్ : నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 1: అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆ పార్టీ నాయకులు గురువారం కొత్తగూడెంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలంటే సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఏమాత్రం గౌరవం లేదన్న విషయం.. అసెంబ్లలో వారి వ్యాఖ్యలతో స్పష్టమైందని అన్నారు. వారిద్దరూ తమ తమ వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చుంచుపల్లి ఎంపీపీ బదావత్ శాంతి, ఎంపీటీసీ సభ్యుల సంఘం అధ్యక్షురాలు కొల్లు పద్మ, కౌన్సిలర్లు వేముల ప్రసాద్, అంబుల వేణు, దూడల బుచ్చయ్య, కొట్టి వెంకటేశ్వర్లు, అన్వర్‌పాషా, ఎండీ ఖాజాబక్ష్, షమ్మీ మైనుద్దీన్, షరీఫ్, జక్కుల సుందర్, పూర్ణ, వినోద్, తొగరు రాజశేఖర్, మాధవీలత, లలితమ్మ, ప్రవంతి, రాణి, అపర్ణ, కరాటే శ్రీను, తాండ్ర శ్రీను, అరుణ్, అశోక్, దూడల కిరణ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

సారపాక, ఆగస్టు 1: బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ పిలుపుమేరకు సారపాక ప్రధాన సెంటర్‌లో పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కనీసం నిండుసభలో గౌరవం ఇవ్వాలన్న జ్ఞానం కూడా సీఎంకు లేదన్నారు. రేవంత్‌రెడ్డి సబితకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, నాయకులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, బెజ్జంకి కనకాచారి, సాలయ్య, గుల్‌మహ్మద్, సోము లక్ష్మీ చైతన్యరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, పంగి సురేశ్, రాంబాబు పాల్గొన్నారు.

కరకగూడెం, ఆగస్టు 1: రాష్ట్రంలో మహిళలను అవమానపరచడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమా అని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కరకగూడెంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో సబితా ఇంద్రారెడ్డిని పార్టీ మారారని అవహేళన చేయడం సమంజసం కాదని, రేవంత్ రెడ్డి ఎన్ని పార్టీలు మారారో ఒక్కసారి గుర్తుచేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు తిరిగి బీఆర్ఎస్‌కు పట్టం కడతారన్నారు.

జ్వర పీడితులతో ఆసుపత్రి కిటకిట

ఆసుపత్రిలో కిటకిటలాడుతున్న జ్వరపీడితులు

చంద్రుగొండ, ఆగస్టు 1: జ్వర పీడితులతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కిటకిటలాడుతున్నది. నిరంతరాయంగా కురుస్తున్న వానలతో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతున్నది. అవుట్ పేషెంట్ల సంఖ్య గురువారం 130 ఉన్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకం తనూజ తెలిపారు. బెడ్లు చాలకపోవడంతో ఒకేదానిపై ఇద్దరు పేషెంట్లను పడుకోబెట్టి వైద్యం చేస్తున్నారు. మందుల కోసం ఇండెంట్ పెట్టినట్లు వైద్యాధికారి చెప్పారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయాలి

దమ్మపేట: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందు రూరల్, ఆగస్టు 1: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సెర్ప్ కార్యాలయంలో ఏపీయం దుర్గారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో వీవోఏలకు రూ.18 వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని తక్షణం నెరవేర్చాలన్నారు.

దమ్మపేట, ఆగస్టు 1: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్న డిమాండుతో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ శ్రేణులు గురువారం దమ్మపేటలో ప్రదర్శన నిర్వహించాయి. తహసీల్ కార్యాలయంలో నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 1: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్న డిమాండుతో సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో గురువారం ప్రదర్శన జరిగింది. తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు.

వట్టికొండ మృతికి సంతాపం

బూర్గంపహాడ్, ఆగస్టు 1: కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది వట్టికొండ సురేశ్‌బాబు మృతికి భద్రాచలం బార్ అసోసియేషన్ గురువారం సంతాపం ప్రకటించింది. ఈ సందర్భంగా న్యాయవాదులు మౌనం పాటించారు.

మృతదేహం లభ్యం

అశ్వాపురం, ఆగస్టు 1: మండలంలోని అమ్మగారిపల్లె గ్రామ శివారులో గోదావరి ఒడ్డున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. చనిపోయిన వ్యక్తి వయస్సు 45 నుంచి 55 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు. అశ్వాపురం సీఐ 8712682093, 8712682095లను సంప్రదించాలన్నారు.

శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలి

టేకులపల్లి, ఆగస్టు 1: మండలంలోని బిల్లుడు తండా గ్రామంలో రోడ్డుపై వెళ్తున్న ముగ్గురు యువకులపై విద్యుత్ తీగ తెగి పడడంతో భూక్యా శ్రీను మృతి చెందాడు. శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, సేవాలాల్ సేన నాయకుల ఆధ్వర్యంలో గురువారం బొమ్మనపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై సురేశ్ వచ్చి బాధితులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

పినపాక, ఆగస్టు 1: మండలంలో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఏడూళ్ళబయ్యారం పోలీసులు అరెస్టు చేశారు. ఏడూళ్ళబయ్యారం సీఐ రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గురువారం తోగ్గూడెం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన సురేష్, రాంబాబును తనిఖీ చేయగా వారి వద్ద ఐదు లీటర్ల సారా పట్టుబడింది. వారిద్దరిని అరెస్ట్ చేసి బైక్ సీజ్ చేసినట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఆళ్ళపల్లి,ఆగస్టు 1: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకున్నది. మండలంలోని రఘువాపురం పంచాయతీ సీతానగర్ గ్రామానికి చెందిన యువతిని తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆళ్ళపల్లికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు.

జ్వరంతో వ్యక్తి మృతి

ఆళ్ళపల్లి, ఆగస్టు 1: ఇల్లెందు మండలం, శెట్టిపల్లి శంభోనిగూడెం గ్రామానికి చెందిన కోర్స కమలహాసన్ (30), ఆళ్లపల్లి మండలం చంద్రాపురం గ్రామానికి చెందిన తన మేన మరదలిని పెళ్లి చేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నాడు. రెండు రోజులుగా అతనికి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆసుప్రతికి తీసుకెళ్ళారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం వెళ్ళాలని వైద్యులు రిఫర్ చేయడంతో ఖమ్మం ఆసుప్రతికి తీసుకెళ్ళారు. చికిత్స అందిస్తుండగా గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పాల్వంచలో చిన్నారి..

పాల్వంచ, ఆగస్టు 1: స్థానిక డీఏవీ పాఠశాల మూడోతరగతి విద్యార్థి బానోత్ రక్షిత్(8) జ్వరంతో గురువారం మృతిచెందాడు. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఈ చిన్నారిని తల్లిదండ్రులు ఆస్పత్రిలో తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈ చిన్నారి తండ్రి వీరభద్రం, మండలంలోని సూరారం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరభద్రం భార్య, డీఎస్సీ రాసేందుకు హైదరాబాద్ వెళ్తూ, రక్షిత్‌ను కారేపల్లి మండలంలోని మాదారం గ్రామంలో తాత వద్ద ఉంచారు. రక్షిత్‌కు గురువారం జ్వరం విపరీతంగా పెరిగింది. ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆ చిన్నారి ప్రాణాలొదిలాడు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పద్మ

పాల్వంచ రూరల్, ఆగస్టు 1: మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మ గురువారం విధుల్లో చేరారు.

పాఠశాలలో వన మహోత్సవం

పాల్వంచ రూరల్, ఆగస్టు 1: మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో గురువారం వన మహోత్సవం జరిగింది. విద్యార్థులతో కలిసి ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ పాపారావు, ఏపీవో రంగా, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పాల్వంచ/అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 1: మాల, మహార్, వాటి అనుబంధ కులాల అభ్యున్నతికి కమిషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండుతో ఈ నెల 7,8,9 తేదీల్లో ధర్నా నిర్వహించనున్నట్లు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమళ్ల సుందర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆయన గురువారం పాల్వంచలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, అశ్వారావుపేట మండలం వినాయకపురం కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు.

'సహకార' సీఈవోగా శ్రీనివాసరావు

ములకలపల్లి, ఆగస్టు 1: ములకలపల్లి సహకార సంఘం సీఈవోగా కుంచారపు శ్రీనివాసరావు గురువారం విధుల్లో చేరారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రవీందర్‌రెడ్డి

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 1: అశ్వారావుపేట ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రవీందర్‌రెడ్డి గురువారం విధుల్లో చేరారు. ఆయన దమ్మపేట ఎంపీడీవోగా ఉన్నారు. ఇక్కడి ఎంపీడీవో జి.శ్రీనివాసరావు ఉద్యోగం విరమించారు.

గాలివానకు కూలిన చెట్లు

చర్ల,ఆగస్టు1: బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని బోదనెల్లి గ్రామంలో కరెంటు తీగలపై చెట్టు పడి కరెంటు సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల కరెంటు స్తంభాలు నెలకొరిగాయి. గురువారం ఉదయం విద్యుత్ శాఖ సిబ్బంది చెట్టును తొలగించి కరెంటు సరఫరాను పునరుద్ధరించారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

సారపాక, ఆగస్టు 1: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని ఎడమ కంటి యామినికి ఉన్నత చదువుల నిమిత్తం మోరంపల్లిబంజర్‌కు చెందిన చేయూత ట్రస్టు రూ.8వేలు గురువారం ఎంపీడీవో జమలారెడ్డి ద్వారా అందజేశారు.

ముగ్గురు మావోయిస్టుల అరెస్ట్
వివరాలు వెల్లడించిన భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

అరెస్టు అయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 1: ముగ్గురు మావోయిస్టులతో పాటు ఒక సానుభూతిపరుడిని అరెస్ట్ చేసినట్లు భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దామరతోగు అటవీ ప్రాంతంలో స్పెషల్ పార్టీ బలగాలు కూంబింగ్ ఆపరేషన్స్ నిర్వహిస్తుండగా.. తెల్లవారుజామున ఓ మహిళతోపాటు మరో ముగ్గురు వ్యక్తులు పోలీసులను గమనించి దాక్కునేందుకు యత్నించారు. దీంతో వారి వెంబడించి పట్టుకున్న భద్రతా బలగాలు విచారించగా.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కుట్ర పోలీస్‌స్టేషన్ పరిధి గొండ్ర గ్రామానికి చెందిన పొట్టం రాజు అలియాస్ జోగా(ఏరియా కమిటీ సభ్యుడు), అదే జిల్లా బైరాంగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధి కోల్నార్ గ్రామానికి చెందిన ఓయం పాండు అలియాస్ రమేశ్, ములుగు జిల్లా దూదేకులపల్లి గ్రామానికి చెందిన పూనెం చుక్కి అలియాస్ తేజా అలియాస్ జోగి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామరతోగు గ్రామానికి చెందిన శ్యామల ముఖేశ్ (సానుభూతిపరుడు) అని తేలింది. పొట్టం రాజు 2016 నుంచి మావోయిస్టు పార్టీలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్సీ)లోని బస్తర్ డివిజన్ 2వ సెంట్రల్ రీజినల్ కంపెనీలో దళ సభ్యుడిగా చేరి.. 2022లో ఏసీఎంగా పదోన్నతి పొందాడు. ఇతడి వద్ద ఇన్‌సాస్ రైఫిల్ తుపాకి ఉండడంతోపాటు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 42 హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నట్లు ఎస్పీ వెల్లడించారు. రమేశ్ కూడా అదే కంపెనీలో 2021 నుంచి దళ సభ్యుడిగా పని చేస్తున్నాడని, ఇతను ఇరు రాష్ట్రాల్లో 19 హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నట్లు తెలిపారు. చుక్కి 2023లో మావోయిస్టు పార్టీలో చేరి.. ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీలో దళ సభ్యురాలిగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖేశ్ కొంత కాలంగా మావోయిస్టు పార్టీకి సానుభూతిపరుడిగా పని చేస్తున్నట్లు వివరించారు. వీరిని అరెస్టు చేయడంతోపాటు వారి వద్ద నుంచి ఇన్‌సాస్ రైఫిల్‌తోపాటు, 29 రౌండ్లు, 303 రైఫిల్‌లో వాడే 12 రౌండ్లను, ఆలివ్‌గ్రీన్ కలర్ యూనిఫాంతోపాటు ఒక గొడ్డలి, కరపత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తివేత

చర్ల, ఆగస్టు 1: పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి నీరువచ్చి చేరుతుంది. ఎగువనున్న ఛత్తీస్‌గఢ్‌లో వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చిచేరుతుంది. అప్పమత్తమైన అధికారులు గురువారం 25 గేట్లు తెరిచారు. 4 గేట్లు పూర్తిగా 21 గేట్లు 2 అడుగుల మేర ఎత్తి 52757క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇల్లెందు రూరల్, ఆగస్టు 1: విద్యుత్ 11కేవీ రామాలయం ఫీడర్ మరమ్మతుల కారణగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 9గంటల వరకు ఆజాద్‌నగర్, సుభాష్‌నగర్, జగదాంబ గుంపు, పాత నర్సాపురం ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

9న కొమ్రుం భీం విగ్రహావిష్కరణ

ఇల్లెందు రూరల్, ఆగస్టు 1: మండలంలోని ఒడ్డుగూడెంలో ఈ నెల 9న ఆదివాసీల పోరాట యోధుడు కొమ్రుం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని, కార్యక్రమానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలి రావాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గొగ్గెల రామస్వామి పిలుపునిచ్చారు. గురువారం విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

దివ్యాంగుల బస్‌పాస్ మేళా

సారపాక, ఆగస్టు 1: భద్రాచలం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బూ